# ట్రేడ్ సీక్రెట్

**వం**ట గది నుంచి వీధి గుమ్మం దగ్గరకూ, మళ్ళీ అక్కడ నుంచి వంట గదికీ తిరుగుతున్న సుజాతని – ముందు గదిలో కూర్చుని పేపరు చదువుకుంటున్న శేషగిరి "స్కోరెంత? ఇంకా ఎన్ని రన్స్ చేయాలి...?" అనడిగాడు.

సుజాత అతని వేపు చిరాగ్గాచూసి "పొద్దున్నే ఏమిటా పరాకు మాటలు...? ఇప్పుడు క్రికెట్‌లో టీవీరావటం లేదుగా..." అంది.

అతను చిన్నగా నవ్వి "పరాకుమాటలు నావి కావు నీవే! టీవీలో క్రికెట్‌రావటం లేదనటానికి తిరగేసి చెబుతున్నావ్! నేనడిగింది నువ్వు చేస్తున్న పరుగుల సంగతి!" అన్నాడు.

సుజాత గట్టిగా నిట్టూర్చింది. "వంటతొందరగా చేసెయ్యాలని రంగమ్మని పెందరాళే రమ్మని చెప్పా. ఇంకా రాలేదు మరి అవసరమైన నాలుగు గిన్నెలూ నేనే కడిగేద్దామని వంట దగిలోకి వెళ్తున్నా కానీ ఆ అంట్ల గిన్నెల్లో చెయ్యి పెట్టలేక... ఇంతలో వచ్చేస్తోందేమో చూద్దామని మళ్ళీ వీధి గుమ్మం దగ్గరకు వస్తున్నా..."

"ఆఫీసుకి తొందరగా వెళ్ళాలని నేనేం చెప్పలేదుగా... వంటకి తొందరెందుకు?" "మీకెప్పుడూ మీ ఆఫీసు గొడవే ముఖ్యం. నా సంగతి పట్టదు. ఈ రోజు 22వ తారీఖు" అంది చివరి మాటని నొక్కి పలుకుతూ...

శేషగిరి ఒక నిముషం కలవరపడ్డాడు. పిల్లలవిగానీ... సుజాతదిగానీ పుట్టినరోజా..? తను మర్చిపోయాడా...! ఆలోచించాడు. కాదని నిర్ధారణ చేసుకున్నాక కొంచెం స్థిమితపడ్డాడు. తమ పెళ్లిరోజూ కాదు. మరింకేమిటో ఆ రోజు ప్రత్యేకత...? అతనికి అంతుపట్టక ఆమెవేపు నిస్సహాయంగా చూశాడు.

సుజాత అతనివేపు చురచుర చూస్తూ నిష్ఠురంగా అంది "మీకెందుకు గుర్తుంటుందిలెండి! నా మీద మీకసలు శ్రద్ధ ఉంటేగా...! ఉండి వుంటే విశ్వంగారూ, సదానందంగారూ వాళ్ళలా రికమెండేషన్ పెట్టించి నాకూ ముందు ఛాన్సు వచ్చేట్లు చేసే వాళ్ళు! ముప్పై ఏళ్లు దాటి మూడేళ్లు అయిందో లేదో అప్పుడే ఇం...త లావు అయిపోయానే అని నేను ఆదుర్దాపడుతేంటే, మీకేం పట్టలేదుగా...!"

అప్పటికి విషయమేమిటో శేషగిరికి అర్థమై నవ్వొచ్చింది! కానీ పైకి నవ్వే సాహసం చేయలేదు. అసలే చిరాగ్గా ఉన్న సుజాత మరింతగా చిరచిర లాడిపోతుందని. ఆ కాలనీలో అంబుజమ్మాళ్ అనే ఆవిడ తన ఇంట్లో వెయిట్ రిడక్షన్ కోర్సు ప్రారంభించింది. ఎక్కడెక్కడికో వెళ్లి... ఎన్నో పద్ధతుల్ని తరిచి చూసి... తను సొంతంగా కనుక్కున్న ఫార్ములా ప్రకారం ట్రీట్‌మెంట్ ఇస్తాననీ, రిజల్టు నూరు శాతం గ్యారంటీ అనీ భరోసా ఇచ్చింది. ఆ మూడు నెలల కోర్సులో ఒక్కొక్కసారి ఒక్కరికి మాత్రమే వీలవుతుందనీ, డైటింగ్ అనేది అసలు అవసరమే లేదనీ చెప్పేసరికి చాలామంది చేరటానికి ఉత్సాహపడ్డారు. కానీ మూడు నెలలకీ కలిపి ఒక్కసారే ముందుగా కట్టాల్సిన భారీ ఫీజుకి భయపడి వెనక్కి తగ్గారు.

కుర్చీలో కూర్చోవటానికి కూడా కుదరనంతగా సైజు పెరిగిపోవడం వల్ల సరదాగా సినిమాకయినా వెళ్ళలేకపోతున్న త్రిపుర సుందరి మాత్రం ఫీజుకి వెనుకాడకుండా ఆ కోర్సులో చేరింది. చిత్రంగా సగానికి సగం బరువు తగ్గిన సుందరిని చూసి అంబుజమ్మాళ్ దగ్గిర మంత్రదండమేమైనా ఉందా అని ఆ కాలనీలోని ఆడవాళ్ళంతా ముక్కున వేలేసుకుని మరీ ఆశ్చర్యపోయారు! ఆపైన ఫీజుకి భయపడకుండా చేరటానికి పోటీలుపడి ఆవిడ ఇంటి ముందు క్యూ కట్టారు. ఎట్టి పరిస్థితిలోనూ ఒకరిని మించి చేర్చుకునే అవకాశం లేదని అంబుజమ్మాళ్ తెగేసి చెప్పటంతో చేసేదేం లేక అందరూ ఫీజులు కట్టేసి వెయింటింగ్ లిస్ట్‌లో ఉండిపోయారు!

ఎవరైనా ఏ కారణం చేతనయినా మధ్యలో మానేస్తే, ఆ ప్లేస్‌లో తనకి కావలసిన వాళ్ళకి ఛాన్సు ఇస్తుందావిడ. అంబుజమ్మాళ్ భర్త రంగనాథన్‌కి తెలిసిన వాళ్లతో రికమెండేషన్ పెట్టించి శేషగిరి ఫ్రెండ్స్ విశ్వం, సదానందం తమ సతీమణులకు మధ్యలో వచ్చిన ఖాళీలలో ప్రవేశాన్ని కల్పించారు. సుజాతకూ ఆ కోర్సులో తొందరగా చేరాలన్న తహతహ ఎక్కువై శేషగిరినీ అలాంటి ప్రయత్నం చేయమని గొడవ పెట్టింది.

శేషగిరికి కోపం వచ్చింది. ''అంత ఫీజు కట్టి చేరటమే దండగనుకుంటే, పైగా రికమెండేషనొకటా...! ఇంకా నయం... నా ఫ్రెండ్సుందర్నీ వెంటేసుకుని వెళ్ళి ఆవిడ ఇంటి ముందు ధర్నా చేయమని అడగలేదు! నువ్వేం అందాల పోటీలకు వెళ్ళడంలేదు కాబట్టి తొందరేం లేదు. నిదానంగా నీ వంతు వచ్చినప్పుడు వెళ్దువుగానీ" అంటూ మండిపడ్డాడు.

దాంతో చేసేదేంలేక సుజాత వెయిటింగ్ లిస్ట్‌లో ఉండిపోయింది. ఆవిడ ఏ పద్ధతుల ద్వారా బరువు తగ్గిస్తుందో తెలుసుకోవాలని ప్రయత్నాలు చేసింది కానీ ఫలించలేదు. తన ఉక్రోషాన్నంతా శేషగిరి దగ్గర వెళ్లబోసుకుంది.

"అమ్మో... కాలనీలోని ఆడవాళ్ళంతా ఎంత లోతుగుండె మనుషులో ఇప్పుడు అర్థమవుతోంది! కమల నాలుగడుగులేస్తే చాలా ఆయాసపడిపోయేదిగా... అలాంటిది మొన్న మార్కెట్‌కి వెళ్తూ కనిపించింది. దగ్గరకు వచ్చే వరకూ నేను గుర్తుపట్టలేకపోయాను! బ్యాగ్ ఊపుకుంటూ చకచకా నడిచేస్తోంది మరి! తనూ అంబుజంగారి వెయిట్ రిడక్షన్ కోర్సులో చేరాకనే కదా సన్నబడింది... అందుకని 'అక్కడ ఎలాంటి ఎక్స్‌రేసైజులు చేయిస్తున్నారు?' అనడిగా.

'తినబోతూ రుచి ఎందుకులెండి... మీరు క్యూలో ఉన్నారుగా, మీకే తెలుస్తుంది' అంటూ వెళ్లిపోయింది అసలు విషయం మాత్రం చెప్పకుండా. పద్మావతిగారు నాకంటే పదేళ్లయినా పెద్దదికదా, ఇప్పుడేమో నాలుగేళ్ళు చిన్నదానిలా కనిపిస్తోంది. అంతనాజూకుగా తయారైంది! ఆవిడైనా చెబుతుందేమోనని అడిగా. "అదొక ట్రేడ్ సీక్రెట్‌లెండి. శంఖంలో పోస్తే గానీ తీర్థం కాదన్నట్లుగా ఫీజు కట్టి గురువు ద్వారా నేర్చుకుంటేగానీ ఏదీ తెలిసిరాదు" అంటూ తెలివిగా మాట మార్చేసింది కానీ చెప్పలేదు! అంతగుట్టేమిటో, చెప్పినంత మాత్రాన వీళ్ళ సొమ్మేంపోతుందో అర్థం కావటంలేదు! "నీక్కూడా అంత ఆదుర్దా, ఆరా ఎందుకో నాకూ అర్థం కావటంలేదు" అంటూ శేషగిరి చిరాకుపడేసరికి ఇక ఆ తరవాత సుజాత అతని దగ్గర ఆ ప్రసక్తి తేలేదుగానీ తనవంతు ఎపుడొస్తుందా అని చాలా ఆసక్తిగా ఎదురుచూసింది. చివరికి ఆరోజు రానే వచ్చింది. ఆ రోజు నుంచి తొందరగా రావాలని రంగమ్మకి ముందురోజే చెప్పింది కానీ రంగమ్మ రాకపోయే సరికి సుజాత హడావుడి పడిపోతోంది.

రంగమ్మ రాకపోయేసరికి శేషగిరిలోనూ ఆందోళన ప్రారంభమైంది. కాకపోతే అతని ఆందోళనకి కారణం మాత్రం వేరే.

ఆ ఊరికి శేషగిరి ట్రాన్స్‌ఫర్ అయి వచ్చిన సంవత్సరం కాలంలో... రంగమ్మ కుదిరేముందు సుజాత దగ్గర చాలామంది పనిమనుషులు మారారు. సుజాతకి ఒక పట్టాన ఎవరూ నచ్చే వాళ్ళు కాదు.

పేరంటానికి వచ్చినట్లుగా ముస్తాబై వచ్చి చీరె నలగకూడదన్నట్లుగా నడుంవంచకుండా పనిచేయబోతే పనేం అవుతుందీ... నాకు నచ్చలేదంటూ ఒకరినీ...

ఇంటి దగ్గర చూసేవాళ్ళెవరూ లేరంటూ ముగ్గురు పిల్లలతో పనిలోకి వస్తోంది. ఆ పిల్లల గోల భరించలేక పోతున్నానంటూ ఇంకొకరినీ...

ఏదైనా చిన్న పని ఎక్కువ చెబితే చాలు చేస్తాననీ, చెయ్యననీ అనకుండా అలవిమాలిన పనులు చెప్పి హింసించేస్తున్నట్లుగా అదొరకరంగా చూస్తుంది. గొడవపెట్టుకునే రకంలా ఉంది కానీ పనిచేసే టైపు కాదంటూ మరొకరినీ...

అలా నలుగురైదుగురిని మానిపించేసింది. ఒకరు మానేశాక మరొకరు కుదిరేవరకూ సుజాత ఇంట్లో వంటచేసేదికాదు. అంట్లుతోమటం అంటే తనకి ఎలర్జీ అనీ తన వల్ల కాదని చెప్పేసి శేషగిరిని క్యారియర్‌తో హోటల్‌కి పంపించేది. ఇక విస్తరాకుల్లోనే భోజనం... అలా జరిగేది. హోటల్‌కి వెళ్ళనవసరం లేకుండా ఇంట్లో వంటచేస్తే, ఆ గిన్నెలు తనే తోముతానని శేషగిరి ముందుకు వచ్చాడు కానీ అందుకూ సుజాత అంగీకరించలేదు.

"నెలకి ఇరవై రోజులు క్యారియర్ పట్టుకుని వెళ్తుంటే... ఆ హోటల్ వాళ్ళు నాకు 'క్యారియర్ సార్' అని పేరు పెట్టేశారు. అంతదూరం నుంచి నన్ను చూడగానే ఆ ప్రొప్రయిటర్ సర్వర్‌తో 'క్యారియర్ సార్ వస్తున్నారు చూడూ...' అంటూ కేకేసి చెబుతున్నాడు. నేను క్యారియర్ పట్టుకుని ఆ హోటల్‌కి వెళ్ళను" అన్నాడు శేషగిరి చిరాగ్గా ఒకసారి.

"సరే వద్దులెండి" అంది సుజాత.

"అయితే పనిమనిషి రానపుడు వంట మానెయ్యకుండా నువ్వే గిన్నెలు తోముకుని వంటచేస్తావా?" ఆనందంగా అడిగాడు.

"అదేంకాదు. నిక్ నేమ్ గురించే కదా మీ బాధ! వేరే హోటల్‌కి వెళ్తే సరి. ఊళ్ళో ఉన్నది అదొక్కటే కాదు గదా!" అంది.

సుజాతను మార్చటం తనవల్ల కాదనుకుంటూ శేషగిరి నిస్సహాయంగా నిట్టూర్చి ఊరుకున్నాడు. రంగమ్మ పనికి కుదిరాక శేషగిరికి క్యారియర్ పట్టుకుని హోటల్‌కి తిరిగే బాధ పూర్తిగా తప్పిపోయింది. సుజాతకి రంగమ్మ పని బాగా నచ్చింది. సుజాత దగ్గర పనికి కుదిరాక రంగమ్మ కూడా ఒక ఇల్లు తప్ప మిగతా వాళ్ళ పనులు మానేసింది. ఆ ఒక్క ఇల్లు కూడా ఎందుకు మానెయ్యలేదంటే... ఆవిడ పొద్దున్నే ఇచ్చే టీకి బాగా అలవాటు పడిపోయానని రంగమ్మ చెప్పేది. సుజాతకి టీ తాగే అలవాటులేదు మరి!

మూడొంతుల పనంతా రంగమ్మే చక్కబెట్టేయంతో సుజాత ఖాళీగా మునుపటికంటే ఇంకా ఎక్కువ సీరియల్స్‌ని చూడగలుగుతోంది చక్కగా! రంగమ్మ కూడా పని మధ్యలో కొంచెం కొంచెం గేప్ తీసుకుని సీరియల్స్ చూడటంలో సుజాతకి కంపెనీ ఇస్తుంటుంది. అది సుజాతకీ ఇష్టమే. ఎటువంటి అభ్యంతరం లేదు. కాకపోతే శేషగిరి మాత్రం అనుకుంటూ ఉంటాడు – రంగమ్మ పని పన్నెండు గంటల వరకూ సాగటానికి కారణం సీరియల్సేనని!

పిచ్చిమొహం... పన్నెండు గంటల వరకూ పనిచేస్తూ మన ఇంటిదగ్గరే ఉండిపోతోంది. పాపం ఈ టైముకి ఇంటికెళ్ళి ఏం వండుకుంటుందీ.. అనుకుంటూ పెద్ద గిన్నెనిండా అన్నం, ఇంత కూరా సుజాత రంగమ్మకిస్తుంటుంది.

సుజాత పెట్టేదాన్ని బట్టి రంగమ్మ శ్రద్ధగా పనిచేస్తోందో... రంగమ్మ బాగా పనిచేస్తుంది కాబట్టి సుజాత బాగా పెడుతోందో... అన్నది తేలని విషయమే అయినా మొత్తానికి ఇద్దరికీ బాగా ట్యూను కుదిరిందన్నది మాత్రం నిజం.

సుజాత చెప్పిన ఏ పని అయినా కాదనకుండా చేసే రంగమ్మ ఆ రోజు నుంచీ పెందరాళే రావాలని చెప్పినా రాలేదంటే... ఏ కారణం చేతనైనా రంగమ్మ పని మానేస్తోందా... తనకి మళ్లీ క్యారియర్ మోత మొదలవుతుందా... అనేది శేషగిరి కలవరానికి కారణం!

ఎదురుగా కూర్చున్న సుజాత మొహం వేయి ఓల్టుల బల్బులా వెలిగిపోతోంటే, కారణం ఏమిటా అని శేషగిరి వెనక్కి చూశాడు. గేటు దగ్గర దేవతలా కనిపించింది రంగమ్మ! పెళ్లి పీటలమీదయినా సుజాత మొహంలో అంత ఆనందం, వెలుగూ చూడలేదని అనుకున్నాడు శేషగిరి.

"ఈ రోజు నుంచి తొందరగా రమ్మని చెబితే... ఇప్పుడా రావటం...?" లోపలకు వచ్చిన రంగమ్మని సుజాత గట్టిగా అడిగింది.

"తప్పయిపోనాదమ్మా. అదేటో మీరు చెప్పిన మాట మరుపుకు వచ్చేసింది! రాజమ్మగోరింట్లో అంట్లుతోముతుంటే... గడియారం గంటలు వినబడగానే మీమాట మతిలోకి వచ్చింది. ఇక ఆ గిన్నెలలాగే వదిలేసి 'సుజాతమ్మ గోరింటికి బేగి ఎల్లాలమ్మా' అని చెప్పేసి పరుగుపరుగున వచ్చీసినాను" అంటూ ఆలస్యానికి సంజాయిషీ ఇచ్చింది.

"అదేమిటే... అలా పనిమధ్యలో వదిలేసి వచ్చేస్తే... ఆవిడకు కోపం వచ్చి పని మానిపించెయ్యదూ...?" ఆశ్చర్యంగా అంది సుజాత.

"ఏమైనా నాకేం బయంనేదమ్మా... మీ తరవాతేనమ్మా నాకెవరైనా! నా కష్టం సుఖం తెలుసుకుని నన్ను కనిపెట్టి చూసుకుంటున్న చల్లని తల్లి తమరు!" అని ఒక క్షణం ఆగి మళ్ళీ అడిగింది – "నాకు బోదపడదుగానీ... మీకెందుకమ్మా అంబుజమ్మగారింటి కెళ్ళి ఒళ్ళు తగ్గించుకునే తిప్పలు...? కొంచెం బొద్దుగా ఉంటే మాత్రమేటమ్మా... ముద్దబంతిపువ్వులా ముద్దుగుంటారుగందా?" సుజాత మోహంలోకి

మెరుపొచ్చింది! ముసిముసి నవ్వులతో “నా తాపత్రయం అందం కోసం ఏం కాదు. ఇపుడు డాక్టర్లు ఆరోగ్యం కోసం బరువు తగ్గాలని చెబుతున్నారుగా... అసలే ఆలస్యం అయింది. ఇక కబుర్లు ఆపి పని మొదలుపెట్టు...” అంటూ మురిపెంగా విసుక్కుంది. రంగమ్మ మాటలు విన్న శేషగిరి మనసులోనే నవ్వుకున్నాడు. సుజాత రంగమ్మని పిచ్చిమోహం అని అనుకుంటూ ఉంటుంది గానీ... నిజానికి ఎదుటి వాళ్ళని మాటలతో మెప్పించగల లౌక్యం తెలిసిన మనిషి అనుకున్నాడు.

శేషగిరి ఆఫీసు పదిన్నర గంటలకి కాబట్టి పిల్లల సంగతీ, మిగిలిన పనులూ అతనికీ, రంగమ్మకీ అప్పచెప్పి హడావుడిగా తయారై, యమ హుషారుగా సుజాత అంబుజమ్మాళ్ ఇంటికి బయలుదేరి వెళ్ళింది.

* * *

సాయంకాలం ఆఫీసు నుంచి వచ్చిన శేషగిరి మంచంమీద నీరసంగా వడిలిన తోటకూరకాడలా పడుకునివున్న సుజాతని చూసి ఆశ్చర్యపోయాడు! “ఒంట్లో బాగాలేదా?” అంటూ పలకరించాడు.

“ఒళ్ళంతా ఒకటే నొప్పులు...” అంటూ సుజాత లేచి కూర్చుని కాళ్ళు చాపుకుంది.

“ఎక్సర్‌సైజులు మరీ ఎక్కువగా చేసేశావా? మొదటి రోజు కాబట్టి కష్టమనిపిస్తుంది. రెండు రోజులు పోతే మామూలుగానే ఉంటుంది. అయినా ఒక గంట అయితే సరిపోయేది. పది నుంచీ ఒంటి గంట వరకూ అంటే... మూడు గంటల టైము ఎక్కువే! ఆడవాళ్ళకి మధ్యమధ్యలో కాలక్షేపం కబుర్లు తప్పనిసరి కాబట్టి అంత సమయం అవసరమే కాబోలు! ఆవునా?”

“కబుర్లా...! నయమే! క్షణం నిలబడటానికి కూడా వీల్లేదు! పనిమధ్యలో రంగమ్మ వచ్చి సీరియల్స్ చూస్తూ నిలబడినా నేనేం అనను కదా! కానీ ఆవిడ మాత్రం అలా ఊరుకునే రకం కాదు. ‘ఏకబిగిని అయిపోవాలి... చెమటలు బాగా పట్టాలీ...’ అంటూ క్షణం కూడా నిలబడనీయలేదు!” ఫిర్యాదు చేస్తున్నట్లుగా చెప్పింది.

“మరి అందుకే కాబోలు అందరూ చిక్కి చక్కనమ్మలవుతున్నారు! నువ్వా ఎప్పుడు చేరతానా అని తెగ ఆరాటపడిపోయావ్‌గా... అక్కడి పద్ధతులేమిటో ఎవరూ చెప్పటం లేదని కూడా ఆదుర్దాపడ్డావ్! ఇప్పుడు స్వయంగా నువ్వే తెలుసుకున్నావ్‌గా... ఆవిడ ఏ పద్ధతిలో ట్రీట్‌మెంట్ ఇస్తోంది...?” శేషగిరి అడిగాడు.

“మునుపు వాళ్ళిల్లు లోపల చూడలేదు. ఈవేళ చూశాగా... అబ్బో... చాలా పెద్దది! ఉమ్మడి కుటుంబం కాబట్టి అంత ఇల్లు అవసరమే మరి! ఆ ఇల్లు కట్టినవాడెవడోగానీ చాలా అయోమయంగా కట్టాడు. వంటగది ఈవైపు నుంటే... అంట్లుతోముకోవటానికి చోటూ, పంపూ అటువైపు ఉంది! బట్టలుతుక్కునేది ఇటు అయితే ఆరేసుకునేది అటు! వంట గది నుంచి గిన్నెలు తెచ్చుకుని తోముకుని మళ్ళీ వంటగదిలో పెట్టుకోవటానికీ, బట్టలుతుక్కుని ఆరేసుకోవటానికీ అరమైలు నడక తప్పనిసరన్నమాట!”

సుజాత మాటలకు శేషగిరికి చిరాకొచ్చింది. “వాళ్ళింటి గొడవ నీకెందుకూ... నువ్వు వెళ్ళిన విషయం చెప్పక...” అన్నాడు విసుగ్గా.

“మనలాగ అన్నంలోకి రెండు కూరలు వాళ్ళకి సరిపోవట. నాలుగురకాలు ఉండాల్సిందే! ఆపైరెండుపూటలూ టిఫిన్ తప్పనిసరి. అందుకే పంపు దగ్గర అంట్లగిన్నెలు గుట్టలా ఉన్నాయ్...!”

“నాలుగు కాకపోతే పది కూరలతో తింటారు. అది వాళ్ళిష్టం... మధ్యలో నీకేమిటి కష్టం...?” స్వరం పెంచి గట్టిగా అన్నాడు.

సుజాత మాత్రం తన ధోరణిలో చెప్పుకుపోయింది. "పిల్లా పెద్దా కలిసి డజనుమంది ఉన్నట్లున్నారు. రెండు పూటలా స్నానాలు చేస్తారుగా... అందుకే... అమ్మో... ఒక్కరోజుకే విడిచిన బట్టలమూట ఇం...త పెద్దది ఉంది...!"

శేషగిరికి పిచ్చికోపం వచ్చింది! "ఏమిటా మతిలేని మాటలు...? వాళ్ళ ఇంటి వాస్తు విశేషాలూ, వంటింటి వివరాలూ... ఈ సోదంతా నాకెందుకూ...?" పెద్దగా అరిచాడు.

సుజాతకి కన్నీళ్ళు చెంపలమీదుగా జలజలాకారాయ్! "ఎందుకేడుస్తున్నావ్?" అంటూ శేషగిరి కంగారుపడ్డాడు. కన్నీళ్ళు తుడుచుకుంటూ సుజాత చెప్పింది.

"నేను మీరడిగిన ప్రశ్నలకే జవాబు చెబుతున్నాను! వెయిట్ రిడక్షన్ కోర్సు అంటే ఏమిటనుకున్నారూ... అంట్లు తోమటం, బట్టలుతకటం, ఇల్లంతా ఊడ్చి తడిగుడ్డతో తుడవటం! బరువు తగ్గటానికీ, చక్కని శరీరాకృతికీ ఇంటి పనికి మించిన ఎక్సర్‌సైజులేదనేదే ఆవిడ రీసెర్చి చేసి కనుక్కున్న సంగతట! ఎవరింట్లో వాళ్ళు చేసుకోవటం అంటే బద్ధకిస్తారనీ, నామోషీ అనుకుంటారనీ ఆవిడ అలా ఏర్పాటు చేసిందట!

మనం డబ్బులిచ్చి పనిచేయించుకుంటుంటే, ఆవిడ డబ్బులు తీసుకుని పనిచేయించుకుంటోంది! ఎవర్నడిగినా అక్కడి పద్ధతులేమిటో ఎందుకు చెప్పలేదో... మధ్యలోనే మానేసిన వాళ్ళు వాళ్ళింట్లో పనిమనుషుల్ని ఎందుకు మానిపించేశారో ఇపుడు నాకర్థమైంది. ముందుగా ఆవిడ అక్కడి పద్ధతుల్ని ఇంట్లోవాళ్ళకి గానీ బయటవాళ్ళకిగానీ ఎవరికీ చెప్పమని కుటుంబ సభ్యుల మీద ప్రమాణం చేస్తున్నట్లుగా రాసి ఉన్న కాగితం మీద సంతకం చేయించుకుంటోంది! ఈ విషయాలన్నీ నేను మీకు చెప్పేశాను. కాబట్టి మీ ద్వారా అందరికీ తెలుస్తుందిగా! ఇక రేపటి నుంచీ ఆవిడ పని క్లోజ్ అయినట్లే...!"

"నిజమా...?" అంటూ విస్తుపోయిన శేషగిరి ఆ తరువాత పెద్దగా నవ్వాడు. అన్నేళ్ళ కాపురంలో తను సుజాతతో చేయించలేకపోయిన పనిని ఫీజు వసూలుచేసి మరీ చేయించిన అంబుజమ్మాళ్‌ని మనసులోనే అభినందించాడు. క్షణం తరువాత అతనికేదో అనుమానం వచ్చి అడిగాడు. "అవునూ... నువ్వా ఆ కాగితం మీద సంతకంచేసి ఉంటావుగా... ప్రమాణం చేసిన సెంటిమెంట్ నీకేం లేదా... నాకు చేప్పేశావ్...?"

సుజాత పెదవులపైకి చిన్న నవ్వు వచ్చింది. "ఏదో... నాకూ కొంచెం తెలివి ఉందిలెండి. ఏమాట అయినా మీ చెవిని వేయందే నేనుండలేనుగా... అందుకని సంతకం చేయమని చెప్పి ఆవిడ నాకు కాగితం ఇచ్చి కాఫీ తేవటానికని లోపలకు వెళ్ళినప్పుడు ఎవరికీ చెప్పనని ఉన్నచోట చిన్న టిక్‌పెట్టి పైన చిన్న అక్షరాలతో 'మా ఆయనకు తప్ప' అనే మాట రాసి సంతకం చేశాను. ఆవిడ మామూలుగా నా సంతకం చూసి కాగితం తీసుకుందంతే. అందువల్లే ఈ డ్రామాకి తెరపడింది!"

శేషగిరి నవ్వుతూ "మీ అందరికీ తెలిసిన విషయాన్నే... తెలివిగా తెలియచేసి సొమ్ము చేసుకున్న ఆవిడ తెలివి తేటల్ని మెచ్చుకోవాల్సిందే...!" అన్నాడు. అంతలోనే అతనికి ఒక ఆలోచన వచ్చింది. తన ద్వారా అందరికీ తెలియకుండా ఉంటేనే ఎక్కువ ప్రయోజనం ఉంటుందేమో కదా అని!

ఈనాడు ఆదివారం. 22, డిశెంబరు, 2002.